

రాంనగర్‌లో డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ రవిచారి

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు

● ఎమ్మెల్యే ముఠా గోపాల్

రాంనగర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. డివిజన్లలో మంచినీరు, డ్రైనేజీ సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గురువారం రాంనగర్ డివిజన్‌లోని ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ వద్ద రూ.35 లక్షలతో నూతన మంచినీటి పైప్‌లైన్ పనులు, బాగ్‌లింగంపల్లి స్ట్రీట్ నెంబర్ 10లో రూ.23 లక్షలతో, సోప్ ఫ్యాక్టరీ వీధిలో రూ. 10 లక్షలతో, శివ మెడికల్ పక్క వీధిలో రూ. 8 లక్షలతో నూతన డ్రైనేజీ పైప్‌లైన్ పనులను కార్పొరేటర్ కె.రవిచారితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. డివిజన్ల వారిగా అవసరం ఉన్న ప్రాంతంలో నూతన మంచినీరు, డ్రైనేజీ పైప్‌లైన్లను ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ, బాగ్‌లింగంపల్లి జలమండలి మేనేజర్ జీవన జ్యోతి, రాంనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శంకర్ ముదిరాజ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు

బర్కత్‌పుర, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్ పరిధిలోని మంచినీటి పైప్‌లైన్లకు మరమ్మతులు చేపడుతున్నట్లు కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తెలిపారు. గురువారం డివిజన్ వెంకటరమణ థియేటర్ వద్ద మంచినీటి పైప్‌లైన్ వాల్ చెడిపోయి నీరు వృధాగా పోతుండడంతో ప్రజల ఫిర్యాదు మేరకు సందర్శించినట్లు ఆమె తెలిపారు. జలమండలి డీజీఎం కృష్ణ, ఏఈ భావన, మేనేజర్ వెంకటేష్ యాదవ్‌లను సంఘటన స్థలానికి పిలిపించి వెంటనే మరమ్మతు పనులు చేపట్టినట్లు తెలిపారు. పైప్‌లైన్ల లీకేజీల వల్ల కలుషిత నీరు సరఫరా అయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు భీమ్‌రాజ్, రవియాదవ్, ఆర్.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



మంచినీటి పైప్‌లైన్ వాల్ లీకేజీని పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఉమాదేవి



చిన్నారులకు యూనిఫాంలు పంపిణీ చేస్తున్న సూపర్ వైజర్ బాల, అంగన్‌వాడీ టీచర్లు స్వప్న, శారద తదితరులు

అంగన్‌వాడీ కేంద్రంలో యూనిఫాంల పంపిణీ

కవాడిగూడ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుకుంటున్న చిన్నారులకు ప్రత్యేక యూనిఫాంలు అందజేస్తుందని హిమాయత్‌నగరన్ సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బాల తెలిపారు. హిమాయత్‌నగర్ సెక్టార్‌లోని బండమైసమ్మనగర్ కమ్యూనిటీహాలులో కొనసాగుతున్న బండమైసమ్మనగర్ సెంటర్ 2, 3, భీమామైదాన్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు యూనిఫాంలు అందజేశారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ బాల మాట్లాడుతూ తన పరిధిలోకి మొత్తం 20 అంగన్‌వాడీ సెంటర్లు వస్తాయని మొదట సొంత భవనాలలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలకు అందజేసిన తరువాత మిగతా సెంటర్లకు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు స్వప్న, శారద, ఆయాలు మీనాక్షి, భువనేశ్వరి, చిన్నారుల తల్లిదండ్రులు. చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



నల్లపోచమ్మ ఆలయంలో విగ్రహ పునః ప్రతిష్ఠలో కార్పొరేటర్ రచనశ్రీ బస్తీ కమిటీ నాయకులు తదితరులు

నల్ల పోచమ్మ ఆలయంలో విగ్రహ పునః ప్రతిష్ఠ

కవాడిగూడ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్ దోమలగూడ బండానగర్ నల్లపోచమ్మ ఆలయంలో గురువారం విగ్రహ పున: ప్రతిష్ఠ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గణపతి హోమం, చండీ హోమం, అర్చనలు, అభిషేకాలు నిర్వహించి అమ్మవారి విగ్రహ పున: ప్రతిష్ఠాపన నిర్వహించారు. పూజా కార్యక్రమంలో కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ, బస్తీ కమిటీ అధ్యక్షుడు చిత్రకుమార్ గౌడ్, బీజేపీ రాష్ట్ర నాయకులు వెంకటేష్, కవాడిగూడ డివిజన్ బీజేపీ అధ్యక్ష కార్యదర్శులు ఎంసీ మహేందర్‌బాబు, బస్తీ వాసులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయ ధర్మకర్తల మండలి ఏర్పాటు

చిక్కడపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని అంజనేయస్వామి ఆలయ ధర్మకర్తల మండలి ఏర్పాటైంది. 18 మంది సభ్యులతో కమిటీని ప్రకటిస్తూ ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి శైలజారామయ్యర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయమై ఆలయ ఈవో దేవనాథంను ప్రశ్నించగా నూతన కమిటీ ఏర్పాటైనట్లు తమకు సమాచారం ఉందని అధికారిక ఉత్తర్వులు అందలేదని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలోని కమిటీలో ఉన్న గణేశ్ కొత్త కమిటీలో ఉన్నారు. శుక్రవారం లేదా శనివారం ఉదయం ఆలయంలో నూతన కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం చేస్తారని తెలిసింది.

● ఎల్ఓసీ అందజేత

అంబర్‌పేట డివిజన్ ప్రేమ్‌నగర్‌కు చెందిన కె. గోపాల్‌కృష్ణ కుమారుడు వంశీ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతని చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి దరఖాస్తు చేసుకోగా అతనికి మంజూరైన రూ.2 లక్షల ఆర్థిక సహాయం ఎల్ఓసీ లేఖను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తన నివాసంలో వంశీ తండ్రికి అందజేశారు.

-గోల్నాక, ఆంధ్రజ్యోతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం



కవాడిగూడ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని ఓ వ్యక్తి (45) మృతదేహాన్ని గాంధీనగర్ పోలీసులు స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. గాంధీనగర్ సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని 45 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మృతదేహం గాంధీ ఆసుపత్రి ఎదురుగా ఉన్న మెట్రో స్టేషన్ ఫుట్‌పాత్‌పై పడి ఉందని సమాచారం అందుకొని వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించినట్లు ఆయన తెలిపారు. అతని ఆచూకీ తెలిసిన వారు వెంటనే గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌లో గాని లేదా ఫోన్ నంబర్ 8712660 140కు సమాచారం అందించాలని సీఐ రాజు కోరారు.

బీసీ ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి

● మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య

రాంనగర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీసీ ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య కోరారు. విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ప్రజాస్వామ్యబద్ధంగా రాయితీలను కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. గురువారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో బీసీ సేన రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు అంశాన్ని ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి బీసీల అభివృద్ధికి యేడాది బడ్జెట్‌లో రూ.3 లక్షల కోట్లు కేటాయించాలన్నారు. ఉద్యోగ నియామకాలలో క్రిమిలేయర్‌ను ఎత్తివేయాలన్నారు. బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ మాట్లాడుతూ బీసీ ఉద్యోగ నియామకాల్లో బ్యాక్‌లాక్ విధానం ఎత్తివేయాలని, క్రిమిలేయర్ బీసీలకు అడ్డంకిగా మారిందన్నారు. బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు బర్క కృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నాయకులు వేమూరి రామకృష్ణ, నీల వెంకటేష్, నందగోపాల్, ఈశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్యను సత్కరించిన కృష్ణ తదితరులు

15న దివ్యాంగుల సహాయ పరికరాల శిబిరం

● బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతమ్‌రావు

బర్కత్‌పుర, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 15న అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో దివ్యాంగుల సహాయ పరికరాల శిబిరం నిర్వహిస్తున్నట్లు బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు తెలిపారు. దివ్యాంగులకు సహాయ పరికరాలను ఉచితంగా పంపిణీ చేసేందుకు శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో దివ్యాంగుల సహాయ పరికరాల శిబిరం వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. దివ్యాంగులకు చేతికర్రలు, వాకర్లు, సంక కర్రలు, వీల్ చైర్స్, వినికిడి యంత్రాలు, కంటి అద్దాలు, కృత్రిమ దంతాలు, కాళ్లు, చేతులు ఉచితంగా అందించడానికి ఈ శిబిరంలో దివ్యాంగులు పూర్తి ఆధారాలతో పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. దివ్యాంగుల ధ్రువీకరణ పత్రం, యూడీ ఐడీ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్, రేషన్ కార్డులు, మూడు పాస్‌పోర్టు సైజు ఫోటోలతో ఈ శిబిరానికి వచ్చి పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

దివ్యాంగులైన అర్హులను గుర్తించిన తర్వాత లబ్ధిదారులకు పరికరాల పంపిణీ చేస్తామన్నారు. 15న ఉదయం 10 నుంచి ఈ కార్యక్రమం కొనసాగుతుందని, అర్హులైన దివ్యాంగులు ఈ శిబిరంలో పాల్గొనాలని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కన్నె ఉమాదేవి, వై.అమృత, బీజేపీ దివ్యాంగుల సెల్ రాష్ట్ర కన్వీనర్ కొల్లి నాగేశ్వరరావు, నాయకులు కన్నె రమేష్‌యాదవ్, ఏడెల్లి అజయ్‌కుమార్, సి.కృష్ణగౌడ్; శ్యామ్‌రాజ్, క్షీరసాగర్, కృష్ణకుమార్, మూల రవీందర్‌గౌడ్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగుల సహాయ పరికరాల శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ గౌతమ్‌రావు

ఎస్సీ వర్గీకరణ చేసి అన్ని కులాలకు న్యాయం చేయాలి

ముషీరాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జనాభా ప్రతిపాదికన ఎస్సీ వర్గీకరణ చేసి ఎస్సీలలో ఉన్న అన్ని కులాలకు న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి భిక్షపతి మాదిగ డిమాండ్ చేశారు. గురువారం ముషీరాబాద్‌లోని మోహన్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగంలో పొందుపర్చిన రిజర్వేషన్ల ప్రకారం ఎస్సీలలోని అన్ని కులాలకు న్యాయం చేకూర్చే విధంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాన్నారు.

మాల సామాజిక వర్గమే అన్ని రంగాలలో లబ్ధిపొందిందని అన్నారు. అందువల్లే బీసీ రిజర్వేషన్లలో వర్గీకరణ ఉన్నట్లుగానే ఎస్సీ రిజర్వేషన్లలో కూడా వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్, సీనియర్ నాయకులు గండి కృష్ణ, ముషీరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి గజ్జల రాజశేఖర్, నాయకులు దశరత్, ఎల్లయ్య, రాములు, శంకర్, కేశవులు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి భిక్షపతి మాదిగ

ముగిసిన హరికథా మహోత్సవం

రాంనగర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నల్లకుంటలోని శృంగేరి శంకరమఠం ప్రాంగణంలో హరికథా పితామహ ఆదిభట్ల నారాయణ దాసు 160వ, వారి శిష్యులు నేతి లక్ష్మీనారాయణ భాగవతుల 126వ జయంతి అయిదవ రోజు గురువారం హరికథా మహోత్సవం శోభాయమానంగా ముగిశాయి. అన్నమయ్య పరివారం వ్యవస్థాపకులు యనమండ్ర వెంకట కృష్ణయ్య, నేతి కుటుంబం నుంచి విశ్వేశ్వరరావు దంపతులు, రామకృష్ణ, పద్మశ్రీ దాలివర్తి ఉమామహేశ్వరి భాగతారిణి, రాష్ట్ర హరిదాస సంఘం అధ్యక్షుడు బి.లక్ష్మీనారాయణ భాగవతులు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ తెలుగు సంస్కృతి చరిత్రలోనే కాదు భారత సంస్కృతి చరిత్రలోనే అపూర్వ వైశిష్ట్యం కలవారని అన్నారు.

ఒక్కొక్క రంగంలో ప్రావీణ్యం ఉన్నవారు ఎందరో ఉండవచ్చని కానీ ఆట, పాటలో మాటలో మేటి అనిపించుకున్న వారు అరుదుగా ఉంటారని అన్నారు. దాసుకు పూర్వం హరికథా చాయలు ఉన్నా దానికి ఒక సమగ్రమైన స్వరూపం, ఉన్నతమైన పీఠం, విశాలమైన పరిధి సంతరించి పెట్టినవారు నారాయణదాసు అని అన్నారు. దాసు సంస్కృతాంధ్రాలలో మహాకవి, హరికథకు సృష్టికర్త, మహానటుడు, గంధర్వ గాయకుడు అని వారన్నారు. అనంతరం బుర్రా పద్మనాభశర్మ భాగవతులు వారి మధురస్వరంలో శ్రీరామ సామ్రాజ్య పట్టాభిషేకం కథాగానం చేసి శ్రోతలను ఆకట్టుకున్నారు.

ఈ సందర్భంగా పద్మశ్రీ దాలివర్తి ఉమామహేశ్వరి భాగతారిణికి శంకర నారాయణ హరికథా సరస్వతి బిరుదు ప్రదానం చేసి సన్మాన పత్రం, శాలువాకప్పి ఘనంగా సత్కరించారు.



ఉమామహేశ్వరి భాగతారిణిని సత్కరించిన శంకరనారాయణ, యనమండ్ర వెంకట కృష్ణయ్య, విశ్వేశ్వరరావు దంపతులు



పాటల పల్లకిలో గీతాలాపన చేస్తున్న నేర్నాల కిషోర్ తదితరులు

తెలంగాణ ఉద్యమ కళాకారులకు

వెయ్యి ఉద్యోగాలు కల్పించాలి

రాంనగర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం 550 ఉద్యోగాలు కళాకారులకు ఇచ్చింది, కానీ నిజమైన తెలంగాణ ఉద్యమ కళాకారులకు అవకాశం కల్పించకపోవడం అన్యాయమని పలువురు వక్తలు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమ కళాకారులకు వెయ్యి ఉద్యోగాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. గురువారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో పాటల పల్లకిలో 32 గంటల దగాపడ్డ కళాకారుల డప్పుల మోత కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమ కళాకారుడు నేర్నాల కిషోర్, అందెశ్రీ, రఘు, అశోక్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

నాడు నిజమైన ఉద్యమ కళాకారులకు తీవ్ర అన్యాయం జరిగిందని, కొంత మంది కళాకారులు ఆర్థిక ఇబ్బందులకు గురై ఆత్మహత్యలు చేసుకున్నారని వాపోయారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చినట్లుగా తెలంగాణ ఉద్యమ కళాకారులకు వెయ్యి ఉద్యోగాలు కల్పించాలని వారు కోరారు. తెలంగాణ ఉద్యమ కళాకారులు కంటి సాయన్న, భూంపల్లి అశోక్, గౌర యాకన్న, మౌనిక, సంపత్, కె.రవి, పాట రాజశ్రీ, మహేష్, శ్రీరామ్, కల్యాణి తదితరులు తమ బాధను ఆటపాటలతో హోరెత్తించారు.



వీసీని సన్మానిస్తున్న మాలమహానాడు నేతలు చెన్నయ్య, బేర బాలకిషన్ తదితరులు

అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ గంటా చక్రపాణికి సన్మానం


కవాడిగూడ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా నూతనంగా నియమితులైన ప్రొఫెసర్ గంటచక్రపాణిని గురువారం జాతీయ మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య తెలంగాణ రాష్ట్ర మాలల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బేర బాలకిషన్‌లు కలిసి శాలువా కప్పి పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత ముప్పై సంవత్సరాలుగా తెలంగాణ ప్రభుత్వ ఫలాలు అందక అనేకమందికి అన్యాయం జరిగిందని, ఇకనైనా తెలంగాణ లో అణగారిన మాలల అభివృద్ధి కోసం కృషి చేయాలని వారు కోరారు.

కార్యక్రమంలో తెలంగాణ మాలమహానాడు అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు, గోపాజి రమేష్, జంగ్లి కిషన్‌లు కూడా ప్రొఫెసర్ గంటా చక్రపాణిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ముదిరాజ్‌లు ఐక్యంగా ఉంటేనే సమస్యలు పరిష్కారం

● ముదిరాజ్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి

గోల్నాక, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ముదిరాజ్ కులస్థులు ఐక్యంగా ఉన్నప్పడే సమస్యలు పరిష్కారం అవుతాయని తెలంగాణ ముదిరాజ్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి యాదగిరి ముదిరాజ్ అన్నారు. రాష్ట్ర జనాభాలో అత్యధికంగా ఉన్న ముదిరాజ్ కులస్థులు అన్ని రంగాలలో ఎంతో వెనుకబడి ఉన్నారని, ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. గోల్నాక డివిజన్ తిరుమలనగర్‌లోని రాష్ట్ర ముదిరాజ్ సంక్షేమ సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలుగా ధ్యాగా రమాముదిరాజ్, ఉపాధ్యక్షురాలుగా వడ్లపల్లిశ్రీదేవి ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా బిచాల తులసీ ముదిరాజ్, కార్యదర్శిగా బాషం దివ్యముదిరాజ్, సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా నవీన్‌ముదిరాజ్, ఉపాధ్యక్షులుగా చింతల సత్యనారాయణ ముదిరాజ్, కె.అనంతయ్యముదిరాజ్, మహబుబ్‌నగర్ జిల్లా యువజన విభాగం అధ్యక్షులుగా శివప్రసాద్ ముదిరాజ్, నగర ప్రధానకార్యదర్శిగా డప్పు గౌతమ్‌ముదిరాజ్, అంబర్‌పేట నియోజకవర్గం ప్రధానకార్యదర్శిగా జూపల్లి శ్రావణ్‌కుమార్‌ముదిరాజ్‌ల నియామకాలను ప్రకటించి వారికి నియామకపు పత్రాలను యాదగిరి ముదిరాజ్ అందజేశారు. నూతనంగా నియమితులైన వారు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి యాదగిరి ముదిరాజ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో సంఘం సలహాదారు అంబర్‌పేట శంకర్ తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు నియామక పత్రాలను అందజేస్తున్న యాదగిరి



సమావేశంలో మాట్లాడుతున్న పీవైఎల్, పీఓడబ్ల్యూ నేతలు

కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఫీజుల దోపిడీ

● చర్యలు తీసుకోవాలని పీవైఎల్, పీఓడబ్ల్యూ నేతల డిమాండ్

రాంనగర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్పత్రులు సమస్యలకు నిలయంగా మారాయని, వైద్యులు, నర్సులు, పారామెడికల్ టెక్నీషియన్స్ కొరత తీవ్రంగా ఉందని ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ , ప్రగతి శీల మహిళా సంఘం నేతలు ఆరోపించారు. దీంతో రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం ప్రజలకు అందడం లేదని, ప్రైవేట్ కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఫీజుల దోపిడీ తీవ్రస్థాయిలో పెరిగిందని ధ్వజమెత్తారు. గురువారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో జరిగిన సమావేశంలో పీవైఎల్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.ఎస్.ప్రదీప్, వి.అజయ్, పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డి.స్వరూప, సీ.హెచ్.శిరోమణిలు మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అరకొర ఇచ్చి మిగతా మందులు ప్రైవేట్ మెడికల్ షాపులలో కొనుక్కోవాల్సి వస్తుందన్నారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో దోపిడీ తీవ్రస్థాయిలో ఉందన్నారు. చిన్న రోగంతో ఆస్పత్రికి వెళ్తే లక్షల బిల్లులు వేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై అసెంబ్లీలో చర్చించి తగు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్, రాకేష్, బి.ఎస్.కృష్ణ, రంగయ్య, చంద్ర అరుణ, బి.ఝాన్సీ, శోభ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌తో మాట్లాడుతున్న వినయ్‌కుమార్, బాధితులు

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలి

● మంత్రి ప్రభాకర్‌ను కలిసిన బస్తీవాసులు

చిక్కడపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ స్వామి వివేకానందనగర్ బస్తీ వాసులకు త్వరగా ఇళ్లు కేటాయించాలని కోరుతూ బస్తీవాసులు గురువారం రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. 75 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న 19 దళితుల ఇళ్లను ఏడాదికిందట రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది కూల్చివేశారని అప్పటినుంచి బాధితులందరం వేరువేరుగా జీవిస్తున్నామని మంత్రి దృష్టికి తెచ్చారు. బాధితులతో పాటు మంత్రిని కలిసిన బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్ ఈ సందర్భంగా మంత్రితో మాట్లాడుతూ బాధితులకు ఇళ్లు కేటాయించాలని కోరారు. బాధితులకు ఇళ్లు కేటాయిస్తామని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారని పేర్కొన్నారు. మంత్రిని కలిసినవారిలో బాధితులు ఎంటీ కృష్ణ, జ్ఞానేశ్వర్, ఆనంద్‌రావు, వసంత్ తదితరులున్నారు.



వైద్యులను సన్మానిస్తున్న హిప్నో పద్మాకమలాకర్

క్యాన్సర్ స్ర్కీనింగ్ క్యాంప్

చిక్కడపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యం సురక్షితమైతే సమాజం బలంగా ఉంటుందని నవభారత్ లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలు డా. హిప్నో పద్మాకమలాకర్ అన్నారు. నవభారత్, క్యాపిటల్ లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో గురువారం సయోధ్య షెల్టర్ హోమ్‌లో క్యాన్సర్ స్ర్కీనింగ్ క్యాంప్ నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన పద్మాకమలాకర్ మాట్లాడుతూ క్యాన్సర్‌పై అవగాహనతో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. ఈ వ్యాధి శారీరక ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా మానసిక స్థితి మీద కూడా తీవ్రమైన ప్రభావం చూపుతుందన్నారు. రోగిలో పోరాడే ఆత్మబలాన్ని పెంచాలని చెప్పారు. ఈసందర్భంగా టెస్టులు నిర్వహించిన వైద్యులను సన్మానించారు. కృష్ణవేణి, డా. దేవిరాణి, ముషారఫ్, మృదుల, స్వప్న, వరలక్ష్మి, భారతి, పార్వతి, రమాదేవి,ప్రశాంత్, నర్సులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళారవిందం గానవిభావరి

చిక్కడపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కళారవిందం సంస్థ ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్నం త్యాగరాయగానసభలో నిర్వహించిన గానవిభావరి ఆకట్టుకుంది. మానవుడే మహనీయుడు శక్తియుతు యుక్తిపరుడు శీర్షికతో నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకులు రామ్‌కుమార్, రేణుకారమేష్, ఇందిర, భార్గవి నాగరాజు, రమేష్‌కుమార్, దేవికృష్ణ, కోదండరామ్‌లు గీతాలు ఆలపించారు. చివరన జరిగిన సభాకార్యక్రమంలో గాయకుడు రామ్‌కుమార్‌ను ఎస్‌బీఐ మాజీ ఏజీఎం, గాయకుడు చింతలపూడి త్రినాథరావు, వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు తదితరులు సన్మానించారు.

విద్యార్థులు నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

తార్నాక, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఎప్పటికప్పుడు నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలని కేంద్ర సముద్ర అభివృద్ధి శాఖ మాజీ కార్యదర్శి, పద్మశ్రీ అవార్డు గ్రహీత ప్రొ. హర్ష్ కె గుప్తా అన్నారు. అసోసియేషన్ ఆఫ్ ఎక్స్‌ప్లోరేషన్ జియోఫిజిసిస్ట్స్ (ఏఈజీ) గోల్డెన్‌జూబ్లీ ఉత్సవాలను పురస్కరించుకుని 'జియో ఎక్స్‌ప్లోరేషన్ ఫర్ క్రిటికల్ మినరల్స్ అండ్ ప్రీషియస్ మెటల్స్' అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును ఓయూలోని ఠాగూర్ ఆడిటోరియంలో ఏర్పాటు చేయగా, గురువారం హర్ష్ కె. గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై భౌగోళిక అన్వేషణ గణనీయమైన ప్రభావం చూపుతుందన్నారు. ఆర్థిక వృద్ధిలో కీలకమైన లోహాలు, విలువైన ఖనిజాలు కీలకపాత్ర పోషిస్తాయని అన్నారు. కార్యక్రమంలో ఏఈజీ ఉపాధ్యక్షుడు, జియోఫిజిక్స్ విభాగాధిపతి ప్రొ. వీరయ్య, ఫ్యాకల్టీ ఆఫ్ డీన్ ప్రొ. కరుణాసాగర్, ఓఎన్జీసీ బేసిన్ మేనేజర్ కరువణ్ణన్ తదితరులు పాల్గొన్నారు.



● ప్రేమ్‌నగర్‌లో పాదయాత్ర

అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ గురువారం ప్రేమ్‌నగర్‌లో పాదయాత్ర చేశారు. ప్రేమ్‌నగర్‌లో త్వరలో స్థానిక బస్తీవాసుల కోసం రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో బస్తీవాసులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. - అంబర్‌పేట, ఆంధ్రజ్యోతి

మొదటి అంతస్తు నుంచి జారిపడ్డ బాలుడు

● తప్పిన ప్రాణాపాయం

అంబర్‌పేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇంటి మొదటి అంతస్తులో ఆడుకుంటున్న ఓ బాలుడు రైలింగ్‌పై నుంచి కింద పడ్డాడు. అదృష్టవశాత్తు అతనికి ఎలాంటి గాయాలు కాకుండా సురక్షితంగా బయటపడ్డాడు. అంబర్‌పేట ఓల్డ్ ప్రేమ్‌నగర్‌లో సత్యనారాయణ ఇంటిలోని మొదటి అంతస్తులో నివాసం ఉండే నిరంజన్ కుమారుడు హర్షవర్ధన్ (2) గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో తన ఇంటి ముందు ఉన్న వరండాలో ఆడుకున్నాడు. ఆ సమయంలో అతడు రైలింగ్ దగ్గర ఆడుతూ జారి కిందపడిపోయాడు. వెంటనే అతని తల్లి గీత స్పందించి బాలుడిని చికిత్స నిమిత్తం నిలోఫర్ ఆస్పత్రికి తరలించింది. ఈ ఘటనలో బాలుడికి ఎలాంటి గాయాలు కాకుండా సురక్షితంగా బయటపడ్డాడు. దీంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం తెలుసుకున్న అంబర్‌పేట పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.